


'కోప్డ్'తో జాగ్రత్త సుమా.. 2



డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి జైలుశిక్ష 2

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

## బస్తీ దవాఖానా పనులను పరిశీలించిన సబ్ కలెక్టర్



**అక్షరటుడే: బోధన్:** పట్టణంలోని 32 వార్డుల్లో జరుగుతున్న బస్తీ దవాఖానా పనులను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో బుధవారం రోజు పరిశీలించారు. మున్సిపల్ డీఈవో కలిసి పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం రాకాసీపేట్‌లోని ఫిల్టర్ బెడ్ పనులను పరిశీలించారు.





## మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్‌లో ఏసీబీ సోదాల కలకలం

**అక్షరటుడే, ఇందూరు :** నిజామాబాద్ నగర కార్పొరేషన్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు కలకలం రేపాయి. కార్పొరేషన్‌లోని టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో బుధవారం ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. కార్పొరేషన్ పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగం కీలకం. అయితే నిజామాబాద్ టౌన్ ప్లానింగ్ అధికారులపై కొంతకాలంగా అనేక ఆరోపణలు వస్తున్నాయి. కొంతమంది నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపడుతున్నా.. అధికారులు మాముళ్లు తీసుకొని చూసి చూడనట్లు ఉంటారనే ఆరోపణలు ఉన్నాయి. భవన నిర్మాణ సమయంలో సైతం భారీ ఎత్తున డబ్బులు తీసుకుంటారని సమాచారం. ఈ క్రమంలో తాజాగా ఏసీబీ అధికారులు సోదాలు చేయడం గమనార్హం. అయితే దాడులకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### అధికారుల్లో కలవరం

ఏసీబీ అధికారులు ఇటీవల నిజామాబాద్ జిల్లా లో వరుసగా సోదాలు చేపడుతున్నారు. దీంతో అవినీతి అధికారుల్లో కలవరం మొదలైంది. ఎక్కడ తమ బండారం బయట పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. గతంలో ఆర్టీఏ కార్యాలయంలో ఏసీబీ సోదాలు నిర్వహించింది. ఈ నెల 14న సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో తనిఖీలు చేపట్టింది. 18న విద్యా శాఖ కార్యాలయంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. తాజగా.. కార్పొరేషన్ పరిధిలోని టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో సోదాలు కొనసాగుతున్నాయి. దీంతో లంచాలు తీసుకునే అధికారులు భయపడుతున్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ కోసం 'డిఫెన్సివ్ డ్రైవింగ్' నిర్వహణ



**అక్షరటుడే నిజామాబాద్ సిటీ :** రోడ్డు ప్రమాదాల నివారణకు అరైవ్ – అలైవ్ – డిఫెన్సివ్ డ్రైవింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి కుటుంబం మీద ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావం ఉంటుందన్నారు. ఈ ప్రమాదాలను నివారించడానికి ప్రధానంగా రోడ్లపై అవగాహన పెంచడానికి, ప్రయాణికులు సురక్షితంగా తమ గమ్యస్థానానికి చేరేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసేందుకు అరైవ్ – అలైవ్ – డిఫెన్సివ్ డ్రైవింగ్ కార్యక్రమం చేపట్టామన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, సేఫ్ డ్రైవింగ్ అలవర్చుకోవడం, డ్రంకన్ డ్రైవ్‌లు తగ్గించడం, హెల్మెట్, సీట్ బెల్టు వాడకం పెంపు, ఓవర్ స్పీడ్, డ్రైవింగ్‌లో మొబైల్ ఫోన్ వాడకం తగ్గించేవిధంగా వాహనదారులకు ప్రధాన ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. అరైవ్ – అలైవ్ – డిఫెన్సివ్ డ్రైవింగ్ కార్యక్రమాలు ఇప్పటినుంచి అన్ని స్కూళ్లు, కళాశాలలు, ఆఫీసుల్లో పనిచేసే వారికి, గ్రామాల్లో, రహదారికి ఇరువైపులా ఉన్న ప్రధాన జంక్షన్ల వద్ద పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు.

పేద, మధ్యతరగతి ప్రజల ప్రయాణాలకు ఆర్టీసీ ఎంతో ముఖ్యం. ఎక్కడికి వెళ్లాలన్నా ప్రభుత్వ బస్సులపై ఆధారపడే వాళ్లు వేలల్లో ఉంటారు. అయితే ఇటీవల కొన్ని పల్లె వెలుగు బస్సులను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చడంపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పల్లె వెలుగు బస్సులు నడుపుతూ ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– అక్షరటుడే, గాంధారి/ఇందూరు



# ఆర్టీసీ.. ఇదేం పని..!

- నడిపేది పల్లెవెలుగు బస్సులు
- వసూలు చేసేది ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

నిజామాబాద్ రీజియన్ పరిధిలో ఐదు డిపోలున్నాయి. ఇందులో ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు మొత్తం 385 ఉంటాయి. ఆయా డిపోల నుంచి పట్టణాలతో పాటు చుట్టుపక్కల మండలాలకు ప్రయాణికులను చేరవేస్తుంటాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక మహాలక్ష్మి పథకం అమలు చేసింది. దీంఒ అధిక సంఖ్యలో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలకు అధికంగా ప్రయాణించడంతో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. పురుషులకు కనీసం కూర్చునేందుకు కూడా వీలు లేకుండా పోయింది. దీంతో కొన్ని డిపోలోని పల్లె వెలుగు బస్సులను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చారు. స్టాప్‌లను తగ్గించి ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చడంతో మహిళల రద్దీ తగ్గుతుందన్న ఉద్దేశంతో ఇలా ఏర్పాటు చేసినట్లు సమాచారం.

### ఛార్జీల మోత..

సాధారణంగా ఎక్స్‌ప్రెస్ బస్సు అంటే కాస్త లగ్జరీ సీట్లతోపాటు వేగంగా వెళ్తాయని తెలుసు. కానీ పల్లె వెలుగు బస్సులనే ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చడంతో ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఇటీవల ఛార్జీలను పెంచడంతో ప్రయాణికులపై అదనపు భారం పడుతుంది. అలాగే ప్రతిరోజూ యథావిధిగా నడవాల్సిన పల్లె వెలుగు బస్సులను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చడంతో గ్రామాలకు వెళ్లాల్సిన ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా ప్రతి గ్రామానికి వెళ్లాల్సిన బస్సులు తగ్గడంతో బస్టాండ్ లోనే గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. పల్లె వెలుగు బస్సులు తక్కువగా ఉండడం.. ఎప్పుడో ఒకటి రాగానే నిండిపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు.

### ఏ బస్సుకు ఆ ఛార్జీలే..

ఆర్డినరీ బస్సులకు ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు వసూలు చేయడం లేదు. కొన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆర్డినరీ బస్సులు లేని సమయంలో అలాట్ చేస్తున్నాం. దానివల్ల ఎలాంటి ఇబ్బంది లేదు. అలాగే ఆర్డినరీ బస్సులు కొన్నింటిని ఎక్స్‌ప్రెస్ బస్సులుగా ఉపయోగిస్తున్నాం. దానికోసం వెనకాల ఎక్స్ ప్రెస్ బస్సు కలర్ వేయడం జరిగింది. దీని గురించి ఉన్నతాధికారులతో మాట్లాడాం. త్వరలో కలర్ మారుస్తాం. – **దినేష్, డిపో మేనేజర్, కామారెడ్డి**

## ప్రతిఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలి



**అక్షరటుడే, ఇందూరు :** ప్రతిఒక్కరూ సేవాగుణాన్ని కలిగి ఉండాలని సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో భోజన సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 23వ తేదీ వరకు సత్య సాయిబాబా జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహిళలకు చీరలు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ భాస్కర్, పీఆర్‌వో ఇంజినీర్ గంగాధర్, సుదర్శన్, దేవేందర్, సతీష్, పుష్ప, మంజుల, అన్నపూర్ణ, సుమధుర తదితరులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాలపై అవగాహన

**అక్షరటుడే, ఆర్మూర్:** సైబర్ అవేర్నెస్ ప్రోగ్రామ్‌లో భాగంగా విశ్రాంత ఉద్యోగులకు పోలీసులు బుధవారం అవగాహన కల్పించారు. ఆర్మూర్ తహశీల్దార్ కార్యాలయంలోని పింఛన్‌దారుల భవనంలో సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ ఏసీపీ వెంకటేశ్వరరావు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, క్రెడిట్ కార్డ్ లిమిట్ ఇంక్రీజ్, తెలియని యాప్స్ డౌన్‌లోడ్, తెలియని లింక్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.



## జాతీయ పారా స్విమ్మింగ్‌లో బంగారు పతకాలు

**అక్షరటుడే, ఇందూరు:** జాతీయ పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఇందూరు వాసి శ్రీనికేష్ బంగారు పతకాలు సాధించాడు. ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో స్విమ్మింగ్ పోటీలు జరిగాయి. పోటీల్లో బంగారు పతకాలతో పాటు ఉత్తమ స్విమ్మింగ్ క్రీడాకారుడి అవార్డు పొందాడు. 100 మీటర్ల ఫ్రీ స్టైల్, 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్, 200 మీటర్ల ఇండివిజువల్ మిడ్లే విభాగాల్లో మూడు బంగారు పతకాలు కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా శ్రీనికేష్ మాట్లాడుతూ.. పతకాలు సాధించడానికి తనకు శిక్షణనిచ్చిన దినేష్ రాజోరియాకు ధన్యవాదాలు తెలిపారు.



## నానో మందులతో రైతులపై భారం

**అక్షరటుడే, కోటగిరి :** సహకార పరపతి సంఘం సభ్యులు నానో మందులను అంటగట్టి తమపై అధికభారం మోపుతున్నారని రైతులు ఆరోపించారు. పోతంగల్ మండలం హెగ్డోలికి చెందిన రైతులు బుధవారం వ్యవసాయాధికారిణి నిషితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. హెగ్డోలి విశాల సొసైటీకి వెళ్తే డీఏపీ పది సంచులు కావాలని అడిగితే అదనంగా మూడు లిక్విడ్ బాటిళ్లు తీసుకుంటేనే ఎరువులు ఇస్తామంటున్నారన్నారు. సంబంధిత సహకార సంఘంపై చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు శ్రావణ్ కుమార్, సుధీర్ తదితరులున్నారు.

## షాపింగ్ మాల్స్‌కు పర్మిషన్లు రద్దు చేయాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ నిర్మిస్తున్న షాపింగ్ మాల్స్‌కు పర్మిషన్లు రద్దు చేయాలని సీపీఐ ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ప్రజాపంథా ఆర్మూర్ సంయుక్త మండలాల కార్యదర్శి కిషన్, సబ్ డివిజన్ నాయకుడు రాజన్న మాట్లాడుతూ.. పట్టణంలోని నెహ్రూకాలనీ, మంథని బ్లాక్ గల్లీలో నివాస గృహాల పేరుతో పర్మిషన్లు తీసుకుని పదుల సంఖ్యలో షట్టర్లను, షాపింగ్‌మాళ్లను ఏర్పాటు చేసి గల్లీవాసులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు.



# ఘనంగా ఇందిరా గాంధీ జయంతి

నగరంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

– మిగతా 2వ పేజీలో..

## విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** విద్యార్థులు ప్రణాళికతో చదివి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి ఆర్ఎల్‌సీ అబ్దుల్ బషీర్ అన్నారు. లింగంపేట్ మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలను బుధవారం సందర్శించారు. విద్యార్థులను కలిసి వారికి అందుతున్న వసతులను, విద్యా సంబంధ విషయాలపై చర్చించారు. విద్యార్థులు త్వరలో జరుగబోయే బోర్డు పరీక్షలకు సరైన ప్రణాళికతో చదవాలని సూచించారు. ఉపాధ్యాయ బృందం విద్యార్థుల అభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందించారు. పాఠశాలలోని వసతులను, రికార్డులను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల సరైన విధంగా నిర్వహిస్తూ.. ఆదర్శ పాఠశాలగా రూపొందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరాములును అభినందించారు.





## కలెక్టర్ సేవలు భేష్.. ధర్మారెడ్డి గ్రామ ప్రజలు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** కొనుగోళ్ల సీజన్ ప్రారంభమైన నెలలోపే ధాన్యం విక్రయాలను పూర్తి చేసిన కలెక్టర్ సేవలు అభినందనీయమని ధర్మారెడ్డి గ్రామస్థులు తెలిపారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో వారు జిల్లా పాలనాధికారి ఆశిష్ సంగ్వాన్‌ను సన్మానించారు. ఇందిరా క్రాంతి పథకం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ద్వారా వేగంగా ధాన్యం సేకరణ జరగడం, రైతుల వద్ద నుంచి ఒక గింజ కూడా నష్టపోకుండా మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయడంపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. సకాలంలో చెల్లింపులు రావడంతో తమకు పెద్ద ఉపశమనంగా మారిందని వారు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడంలో ధర్మారెడ్డి గ్రామ రైతులు చూపిన సహకారాన్ని జిల్లా కలెక్టర్ ప్రశంసించారు. రికార్డు స్థాయిలో పనితీరును ప్రదర్శించి జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా నిలబెట్టడంలో ముఖ్య పాత్ర పోషించిన ఐకేపీ సీసీ ఇన్‌ఛార్జి కొమ్మ దత్తు, కేంద్ర సిబ్బంది, మహిళా సమాఖ్య కమిటీ సభ్యులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, ఏపీఎం రాంనారాయణ గౌడ్, రైతులు నారాయణ, దేవయ్య, సాయిబాబా, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## 21 నుంచి చౌక్కయ్యగుట్ట బ్రహ్మోత్సవాలు

**అక్షరటుడే, భీమ్‌గల్:** చౌక్కయాద్రి (చౌక్కయ్య గుట్ట) బ్రహ్మోత్సవాలను నిర్వహిం చనున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు, అర్చకులు సింహాగ్రి స్వామి తెలిపారు. ఈ మేరకు బుధవారం చౌక్కయ్య గుట్టపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 21న ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 21న ఉదయం స్వామి ఉత్సవ విగ్రహాలు గ్రామాలయం నుంచి గుట్టపైకి ఎదు ర్కోలు కార్యక్రమం ఉంటుందన్నారు. 22న ఉదయం ప్రాభోదిక, విశ్వక్షేన విధి, అభిషేకం, ఎదుర్కోలు శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం, మహాపూర్ణ హుతి, సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపాలంకరణ, స్వామి వారికి ఉంజల్ సేవ, స్వామి కీర్తనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొ న్నారు. 23న సత్యనారాయణ వ్రతం, సహస్ర నామ పారాయణం, స్వామి ఉత్సవ మూర్తులను కొండపై నుండి గ్రామాలయానికి చేర్చడంతో ఉత్సవాలు ముగుస్తాయ న్నారు. మూడు రోజుల పాటు కొండపై నిర్వహించే ఉత్సవాల్లో అన్నప్రసాదం, తీర్థ ప్రసాదం అందజేస్తామన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన అధికారులు



**అక్షరటుడే, బాల్కొండ:** మండల పరిధిలోని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లను అధికారు లు గురువారం ప్రత్యేకంగా సందర్శించారు. లబ్ధిదారులందరూ తమ ఇళ్లను త్వరగా ప్రారంభించుకోవాలని సూచించారు. ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే వార్డు ఆఫీసర్ల ను గాని.. స్థానిక అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్ ఛార్జి ఎంపీడీవో దాసరి రమణ, ఎంపీవో గంగామోహన్, నితీశ్ కుమార్, పంచా యతీ కార్యదర్శి రజినీకాంత్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ నిషత్ రెడ్డి పాల్గొన్నారు. అధికారులు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకు న్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన సదస్సు



**అక్షరటుడే, ఆర్మూర్:** వేల్పూర్ మండలం పడగల్ గ్రామంలోని జీపీ కార్యాలయంలో రెండో విడత ఇందిరమ్మ లబ్ధిదా రులతో బుధవారం సమావేశం నిర్వహిం చారు. కార్యదర్శి సృజన్ కుమార్, హౌసింగ్ ఏఈ ప్రశాంత్ ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో మంజూరైన 20 మందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ నాయకులు తలారి జాన్, ముకుంద, రాజముత్యం, నల్లరాజు, గడ్డం రంజిత్, కొట్టాల చిన్నారెడ్డి, బొంబాయి గంగాధర్, గైని నరేందర్, లబ్ధిదారు లు పాల్గొన్నారు.

## పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



**అక్షరటుడే, బోధన్:** మండలంలో ని ఏరాజ్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పా ఠశాలలో బుధవారం పదోతరగ తి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. ప్రతిభ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ పార్ట్‌నర్ విజయభాస్కర్ రెడ్డి బర్త్ డే సందర్భంగా 'మేముసైతం' ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిం చారు. పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ సంద ర్భంగా 'మేము సైతం' నిర్వాహకుడు డాక్టర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. సమాజం గర్వించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షిచారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పుష్పలత, ఉపాధ్యాయులు ఉదయలక్ష్మి, శ్రీలక్ష్మి, కాట్రగడ్డ భారతి, సునీత, యామిని, చంద్రశేఖర్ విద్యార్థులు పాల్గొన్నారు.


## భారత రాజ్యాంగంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీ



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలోని మండల విద్యాశాఖ వనరుల కేంద్రంలో ఎంఈవో ఆంధ్రయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వ హించారు. నవంబర్ 26న భారత రాజ్యాంగ ఆమోదించబడిన సందర్భంగా 'భారత రాజ్యాంగం'పై మండలస్థాయి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. పోటీలకు కో-ఆర్డినేటర్‌గా ఉప్పులూరు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయు డు సల్లూరి కిషన్ గౌడ్ వ్యవహరించారు. కమ్మర్‌పల్లి కాంప్లెక్స్ హెచ్ఎం సాయన్న వ్యాసరచన పోటీలను పర్యవేక్షించారు. పోటీల్లో జడ్పీ హెచ్ఎస్ కమ్మర్‌పల్లి విద్యార్థి హరీష్ మొదటి బహుమతి, జడ్పీ హెచ్ఎస్ ఉప్పులూరు విద్యార్థి మాధురి ద్వితీయ బహుమతి, జడ్పీ హెచ్ఎస్ కమ్మర్‌పల్లి విద్యార్థి శ్రీజ తృతీయ బహుమతి పొందారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా పాఠశాలల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు రాకేష్ గౌడ్, గంగ ప్రసాద్, జాన్, రమేష్, శ్రీలత, దీప, నర్సయ్య పాల్గొన్నారు.

**ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది బాధపడుతున్న అత్యంత ప్రమాదకర శ్వాస సంబంధిత వ్యాధుల్లో 'కోప్డ్' (క్రానిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్) ఒకటి. ప్రతి ఏడాది నవంబరు మూడో బుధవారం వరల్డ్ కోప్డ్ డేగా నిర్వహించుకుంటారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆర్‌పీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డా. రాజేంద్ర ప్రసాద్ కోప్డ్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో ముఖ్యమైన సూచనలు ఇస్తున్నారు.**

– అక్షరటుడే, నిజామాబాద్ సిటీ



# 'కోప్డ్'తో జాగ్రత్త సుమా..

- క్రానిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్‌తో ఇబ్బందులెన్నో..
- ముందస్తు పరీక్షలు చేసుకుంటే ప్రమాదం తప్పినట్లే..

కోప్డ్ (దీర్ఘకాలిక శ్వాస సంబంధిత వ్యాధి) అనేది శ్వాస నాళాలు కుచించుకుపోయి శ్వాస తీసుకోవడం కష్టమయ్యే దీర్ఘకాలిక వ్యాధి. ముందుగా చిన్నచిన్న లక్షణాలతో మొదలై కాలక్ర మేణ తీవ్రమవుతుంది.

### కోప్డ్ రావడానికి ముఖ్యమైన కారణాలు

ధూమపానం, పర్యావరణ కాలుష్యం, ఇంట్లో పొగ, దుమ్ము, బొగ్గు స్టౌవ్ వాడకం, జెనెటిక్ కారణాలు, వాయు కాలుష్య పరిశ్రమల్లో పనిచేయడం ద్వారా ఈ వ్యాధి సంక్రమించే అవకాశాలున్నాయి.

### ముందుగా కనిపించే లక్షణాలు

ఈ వ్యాధి వచ్చిన వారిలో తరచుగా దగ్గు రావడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడుతుంది. అలాగే ఛాతిలో బిగుతుగా ఉండడం, శరీరానికి శక్తి తగ్గడం ఏర్పడుతుంది. చిన్న పనులు చేసినా ఊపిరి బిగుసుకుపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తుంటాయి.

### కోప్డ్ వ్యాధి నిర్ధారణ ఎలా..?

ముందుగా రోగిని పరీక్షించిన వైద్యులు లంగ్ ఫంక్షన్ టెస్ట్, చెస్ట్ ఎక్స్‌రే, సిటీస్కాన్ పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే పల్స్ ఆక్సిమెట్రీ ద్వారా పల్స్ చెక్ చేస్తారు. ఆరు నిమిషాల వాక్ టెస్ కూడా నిర్వహిస్తారు. అనంతరం రోగికి వ్యాధి నిర్ధారణ చేస్తారు.

### చికిత్స.. జీవనశైలి మార్పులు

కోప్డ్ రోగులు వెంటనే ధూమపానాన్ని పూర్తిగా మానేయాలి. ఇంట్లో పొగ తగ్గించాల్సి ఉంటుంది. రోజూ శ్వాస వ్యాయామాలు చేయాలి. డాక్టర్ సూచించిన ఇన్‌హెలర్స్‌ను సమయానికి వాడాలి. పర్యావరణ పరిశుభ్రత పాటించాలి.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..

ధూమపానం చేసేవారు వెంటనే ఆపివేయాల్సి ఉంటుంది. పిల్లలు, వృద్ధులు పొగ దగ్గరకు వెళ్లకుండా చూడాలి, మాస్క్ ఉపయోగించాలి. ఇంట్లో తగినంత గాలి ప్రసరణ ఉండాలి.

### కోప్డ్ నివారించగలిగే వ్యాధి..



కోప్డ్ అనేది అనేది నివారించగలిగే వ్యాధి. అవగాహన పెంచడం, ముందస్తు పరీక్షలు చేయించడం ద్వారా చాలామంది ప్రాణాలను రక్షించవచ్చు. ప్రజలు తమ శ్వాస ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సం ప్రదించాలి.

- డాక్టర్ రాజేంద్రప్రసాద్, పల్మనాలజిస్ట్, ఆర్‌పీ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్



అక్షరటుడే



ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో..



ఆర్మూర్ మండలం చేపూర్ పల్లె లో...



బడాభీమ్ గల్ గ్రామంలో..



కమ్మర్ పల్లి మండలలో..

## ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని ఉమ్మడిజిల్లాలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంఓ ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేశానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. అలాగే కాంగ్రెస్ కార్యాలయాల్లో సంబురాలు నిర్వహించారు. ఆస్పత్రుల్లో పండ్లు పంపిణీ చేశారు. – అక్షరటుడే, నెట్‌వర్క్



నందిపేట్ మండల కేంద్రంలో..



బాన్సువాడ పట్టణ కేంద్రంలో..



పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో..



## బాధిత కుటుంబాలను పరామర్శించిన పోచారం

**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలో మంగళవా రం పలు కుటుంబాలను ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పలు కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన పాత బాన్సు వాడకు చెందిన లింగాల నాగిరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన కుటుంసభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అలాగే, పాత బాన్సువాడకు చెందిన కులకర్ణి నర్సింగ్ రావు (పంతులు) అనారోగ్యంతో మృతిచెందడం తో వారి ఇంటికి కూడా వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎర్వాల కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.



## ఆర్మూర్‌లో హెల్త్ క్యాంప్ నిర్వహణ

**అక్షరటుడే, ఆర్మూర్:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్, లైఫ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆర్మూర్ పట్ట ణంలో బుధవారం హెల్త్‌క్యాంప్ నిర్వహించారు. లైఫ్ ఆస్పత్రి వైద్యుడు భాను రామగిరి సహకారం తో జెండా గల్లీలోని వేంకటేశ్వర కళ్యాణ మండ పంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సంద ర్భంగా డాక్టర్ భాను రామగిరి షుగర్ కొలెస్ట్రాల్ ఎక్కువగా వచ్చిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్త లు వివరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ అధ్యక్షుడు ఆకుల రాజు, సెక్రె టరీ లీడర్ శ్రీనివాస్, కోశాధికారి గోపికృష్ణ, లయన్స్ ప్రతినిధులు చేపూరు గణేశ్, గుజరాతి ప్రకాష్, అల్జాపూర్ రాజేష్, బాలాజీ రావు, దాచేపల్లి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు టీ షర్ట్స్ అందజేత



**అక్షరటుడే, కోటగిరి:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్ పల్లి సహకారంతో రుద్రూర్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం స్కూల్ పేరుతో ఉన్న టీషర్ట్స్ అందజేశారు. పాఠశాలల హెచ్ఎం, అధ్యాపక బృందం సహకారంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఈ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ సుమారు 120 మంది విద్యార్థినులకు టీషర్ట్స్ అందింపజేయడం ఆనం దంగా ఉందన్నారు. అలాగే ఆహ్లాదకరమైన వా తావరణంలో బాలికల పాఠశాల నిర్వహణ బా గుందన్నారు. కార్యక్రమానికి సహకరించిన క్లబ్ సభ్యులు రాజబాబు, చలసాని శ్రీకాంత్‌లను అభి నందించారు. కార్యక్రమంలో ట్రెజరర్ గోపాలరా వు, గాంధీ శ్రీనివాసరాజు, హరిబాబు, దుర్గారా వు, చక్రవర్తి, రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి జైలుశిక్ష

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి జై లుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ఐదో టౌన్ ఎస్‌హెచ్‌వో గంగాధర్ వెల్లడించిన వివరాల మేరకు.. ఐదో టౌన్ పరిధిలో తనిఖీలు చేస్తుం డగా సోమవారం రాత్రి వర్ని చౌరస్తా వద్ద దారుగల్లీకి చెందిన షేక్ సుల్తాన్ మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లుగా గుర్తించారు. అనంతరం అతడికి కౌన్సెలింగ్ నిర్వహించి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. విచారించిన న్యాయమూర్తి అతడికి ఏడు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

### ఆర్మూర్‌లో ముగ్గురికి రూ.30వేల జరిమానా

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ముగ్గురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లుగా గుర్తించి వారిని ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. విచారించిన కోర్టు ఒక్కొక్కరికి రూ. 10వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చిందని ఆయన వివరించారు.